'నీట్'కు పటిష్ట బందోబస్తు

పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

అధికారుల సమీక్ష సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు

అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు, సమావేశంలో పాల్గొన్న అధికారులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 2 : నీట్ పరీక్ష నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు తెలిపారు. జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల వద్ద విధులకు హాజరుకానున్న అధికారులతో ఆయన తన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్ర 5 గంటల వరకు పరీక్ష జరిగే కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల, పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల/జూనియర్ కళాశాల, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మైనింగ్(కేఎస్ఎం) కళాశాల వద్ద పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా బందోబస్తు అధికారులు, సిబ్బంది సహకరించాలన్నారు. బందోబస్తు డ్యూటీ అధికారులు పరీక్ష ముగిసే వరకు పర్యవేక్షిస్తూ.. అక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

అభ్యర్థులు పాటించాల్సిన నియమ నిబంధనలు

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుంది. కేంద్రంలోకి వచ్చే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆభరణాలు, షూస్, సాక్స్, బెల్ట్, చైన్లు, చెవి పోగులు, బ్యాగులు తీసుకెళ్లకూడదు. ప్రవేశ ద్వారం వద్ద మహిళా, పురుష అభ్యర్థులను వేర్వేరుగా క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డుతోపాటు గుర్తింపు కార్డు, రెండు పాస్ట్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒక పోస్ట్‌కార్డు సైజు ఫొటోను తమ వెంట తప్పనిసరిగా తీసుకెళ్లాలి. పరీక్షా కేంద్రాల చుట్టూ పూర్తిగా సీసీ కెమెరాలతోపాటు పటిష్టమైన నిఘా ఉంటుంది. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు ఎవరూ ఉండకూడదు. ఆ ప్రాంతంలో 163 భారతీయ నాగరికా సురక్షా సంహిత్(బీఎన్ఎస్ఎస్) అమలులో ఉంటుంది. పరీక్ష రోజు కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ సెంటర్లు, కంప్యూటర్ సెంటర్లు మూసివేయాలి. అభ్యర్థులను ముందుగానే బయోమెట్రిక్ ద్వారా చెక్ చేసి, పరీక్ష రాసే సమయంలో వీడియోగ్రఫీ చేస్తారు. కొత్తగూడెం బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్లు, బస్సులు ఆగే స్థలాల నుంచి అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు క్యూఆర్ కోడ్ చేస్తారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులతోపాటు ఇన్విజిలేటర్లకు సంబంధించిన ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవు.

70 లక్షల మొక్కలే లక్ష్యం

వన మహోత్సవంలో నాటేందుకు శాఖలకు లక్ష్యాల నిర్దేశం : కలెక్టర్ జితేశ్ వి పాటిల్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మే 2 (నమస్తే తెలంగాణ) : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 70 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించినట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో 2025-26 వన మహోత్సవంపై ఐటీడీఏ పీవో రాహుల్, అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్‌తో కలిసి కలెక్టర్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏటా నర్సరీల్లో మొక్కలు పెంచి వాటిని విరివిగా నాటేందుకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ మేరకు ఆయా శాఖలకు లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఏడాది రైతులకు ఇంటి ఆవరణ, రహదారులు, కెనాల్ బండ్ వెంట ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. అత్యధికంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 30 లక్షల మొక్కలు, టీజీఎఫ్‌డీసీ శాఖకు 12 లక్షలు, అటవీ శాఖ 10 లక్షలు, సింగరేణి 10 లక్షలు, ఉద్యానవన శాఖ 5.7 లక్షలు, వ్యవసాయ శాఖ 5 లక్షలు, ఇరిగేషన్ 2 లక్షల చొప్పున మొక్కలు నాటాలని లక్ష్యాలను నిర్దేశించారు. ఇందుకోసం ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, వారికి కావాల్సిన మొక్కలను గ్రామీణాభివృద్ధి నర్సరీ నుంచి తీసుకోవాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీపీవో చంద్రమౌళి, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిశోర్, ఇరిగేషన్ ఈఈ అర్జున్‌రావు, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి తిరుపతయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'రక్తదాతలే అసలైన ప్రాణదాతలు'

పురస్కారాలు అందుకున్న రక్తదాతలు

లక్ష్మీదేవిపల్లి, మే 2: రక్తదాతలే అసలైన ప్రాణదాతలని జలమండలి ఎండీ, ఐఏఎస్ అధికారి అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకోసం ఇంటికో రక్తదాతను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగడం అభినందనీయమని అన్నారు. కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లికి చెందిన యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ బాధ్యులు.. జాతీయస్థాయిలో యంగ్ ఇండియన్ సేవా పురస్కారాల ప్రదానోత్సవాన్ని హైదరాబాద్ నాంపల్లి నెహ్రూ ఆడిటోరియంలో గురువారం రాత్రి నిర్వహించారు. క్లబ్ ఫౌండర్, ప్రెసిడెంట్ జేబీ బాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ నలుమూలలా రక్తం అవసరమైన వారికి రక్తాన్ని అందించడం కోసం యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రక్తదాతలకు పురస్కారాలు ప్రదానం చేశారు. కొత్తగూడెం నుంచి పలువురు అధికారులు, క్లబ్ బాధ్యులు ఏడుకొండలు, సంగం వెంకటపుల్లయ్య, కల్పన, రజిత, వెంకటరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆదిత్య పాల్గొన్నారు.

'ఓపెన్ టెన్నిస్'లో విన్నర్లు, రన్నర్లుగా పాల్వంచ క్రీడాకారులు

క్రీడాకారులను సన్మానిస్తున్న పాల్వంచ టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు

పాల్వంచ, మే 2: ఖమ్మం పటేల్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఓపెన్ టెన్నిస్ పోటీల్లో పాల్వంచకు చెందిన అన్నం వెంకటేశ్వర్లు టీం సభ్యులు విన్నర్లుగా, సతీశ్, కృష్ణారావు రన్నర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా పాల్వంచ టెన్నిస్ అసిసోయేషన్ బాధ్యుడు వై.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆణిముత్యాల్లాంటి మరెందురో టెన్నిస్ క్రీడాకారులను తయారు చేస్తామని అన్నారు. అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, డాక్టర్ సుకృత, భాస్కర్, కబీర్‌దాస్, వంశీ, అతిథులు పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్ఐ డీఎస్పీ, బెటాలియన్ డీఎస్పీ, పాల్వంచ పట్టణ సీఐ సతీశ్, ఎస్ఐఎఫ్ సీఐ, నవభారత్ సీనియర్ క్రీడాకారులు వాసు, రాజ్‌కుమార్, అశోక్, డాక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రణయ్, మనోజ్, విగ్నేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఇంకుడు గుంతల నిర్మాణం

అశ్వారావుపేట, మే 2: పట్టణంలోని నెహ్రూ నగర్, గాడ్రాల, జమ్మిగూడెం, దురదపాడు తదితర పాఠశాలల్లో శుక్రవారం ఇంకుడు గుంతలకు ఎంఈవో ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

* I, **KALIYAMOORTHY SHANKAR,** R/O. 5-4-187, GANDHI NAGAR, NAVABHARATH, SILL CAMPUS, PALWANCHA, BHADRADRI KOTHAGUDEM - 507154, T.S. Changed my name as **NATARAJAPURAM KALAYAMOORTHI SANKAR (NK SANKAR),** S/O. KALAYAMOORTHI.

KMM -

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సింగరేణి ఉద్యోగికి కత్తిపోట్లు

ఇల్లెందు, మే 2: సింగరేణి ఉద్యోగికి కత్తిపోట్లతో తీవ్ర గాయాలయ్యాయి. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. స్థానిక జేకే కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి కొండూరి చిన్న, గురువారం రాత్రి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఇద్దరు వ్యక్తులు కొప్పుల కోటయ్య, సందీప్ ఘర్షణ పడుతూ కనిపించారు. కోటయ్యపై సందీప్ కత్తితో దాడి చేస్తుండగా కొండూరి చిన్న చూశారు. సందీప్‌ను వారించేందుకు, కోటయ్యను రక్షించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే చిన్నకు కత్తిపోట్ల కారణంగా తీవ్ర గాయాలయ్యాయి. అతడి ఫిర్యాదుతో సందీప్‌పై కేసు నమోదైంది. అతడిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశంతో రిమాండుకు తరలించారు.

సింగరేణి.. ఉద్యోగాల గనిగా మారాలి

నియామక పత్రాల అందజేతలో డిప్యూటీ సీఎం భట్టి

నియామక పత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం

కొత్తగూడెం సింగరేణి, మే 2 : సింగరేణి సంస్థ ఉద్యోగాల గనిగా మారాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. అందులో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యమని అన్నారు. సింగరేణి కారుణ్య నియామకాల్లో వయో పరిమితి పెంపు లబ్ధిదారులకు హైదరాబాద్ ప్రజా భవన్‌లో శుక్రవారం ఆయన ఉద్యోగ పత్రాల అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల్లో గరిష్ట వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరిన మీదట దీనిపై తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి అంగీకరించామని అన్నారు. సీఎండీ బలరాం, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, జీఎం పర్సనల్ కవితానాయుడు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు న్యాయమూర్తుల సంతాపం

సంతాపం తెలుపుతున్న జిల్లా జడ్జి, న్యాయవాదులు

కొత్తగూడెం టౌన్, మే 2: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి హేయమైనదని జిల్లా జడ్జి వసంత్ పాటిల్ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అధ్యక్షతన బార్ అసోసియేషన్ లైబ్రరీ హాల్లో శుక్రవారం ఏర్పాటుచేసిన నూతన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమంలో జిల్లా జడ్జి పాటిల్ వసంత్ మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాద దాడి మృతులకు సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. న్యాయమూర్తులు సరిత, కిరణ్‌కుమార్, రాజేందర్, సుచరిత, సాయిశ్రీ, రవికుమార్, మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బాలునాయక్‌కు అవార్డు

పాల్వంచ రూరల్, మే 2: కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బాలునాయక్‌కు కూడా యంగ్ ఇండియన్ సేవా పురస్కారాన్ని సదరు ఫౌండేషన్ బాధ్యులు హైదరాబాద్‌లో ప్రదానం చేశారు.

హజ్ యాత్రికులకు సన్మానం

హజ్ యాత్రికులను సన్మానిస్తున్న మసీదు కమిటీ బాధ్యులు

పాల్వంచ, మే 2 : హజ్‌యాత్రకు వెళ్తున్న షేక్ మీరా సాహెబ్, షేక్ సైదులును స్థానిక జామా మసీద్ కమిటీ బాధ్యులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రపంచశాంతి కోసం పవిత్ర మక్కాలో ప్రార్థన చేయాలంటూ హజ్‌యాత్రలో పాల్గొనబోయే వారిని కోరారు. మసీదు కమిటీ బాధ్యులు ఫయాజుల్ హాస్సన్, ఇబ్రహీం ఖురేషి, ఖాజా అహ్మద్, అక్బర్, మస్తాన్ ఖురేషి, ఫక్రుద్దీన్, రహీం, ఫారూఖ్, హన్ను పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ రూరల్, మే 2: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పాల్వంచ రూరల్ ఏఈ జీ.రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిన్నెరసాని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి

పాల్వంచ, మే 2: పహల్గాం ఉగ్రదాడి మృతులకు పాల్వంచ మున్నూరు కాపు సంఘం బాధ్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పాల్వంచ అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శన చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'నేటి నుంచి సింగరేణి సమ్మర్ కోచింగ్ క్యాంపు'

రామవరం, మే 2: సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 28 వరకు సమ్మర్ కోచింగ్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం శాలెంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లలోపు వయసున్న సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, పరిసర ప్రాంత చిన్నారులకు ఈ క్యాంపును నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల పిల్లలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9959508782 నంబరులో స్పోర్ట్స్ ఆఫీసర్‌ను సంప్రదించాలని కోరారు.

జీఎం (పర్సనల్)గా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

కిరణ్‌కుమార్

కొత్తగూడెం సింగరేణి, మే 2: సింగరేణి జీఎం (పర్సనల్)గా కిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈఎస్ఐసీ సంస్థకు అడిషనల్ కమిషనర్‌గా డిప్యూటేషన్‌పై వెళ్లిన ఆయన.. ఇటీవల తిరిగి సింగరేణి సంస్థలోకి వచ్చారు. అనంతరం సింగరేణి సంస్థ ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి జీఎం (పర్సనల్, వెల్ఫేర్, సీఎస్ఆర్)గా నియమించింది. దీంతో సింగరేణి హెడ్డాఫీస్‌లోని జీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వావ్.. వర్షిత్..!

పినపాక, మే 2: ఇటీవల వెలువడిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విభాగం విద్యార్థి లింగంపల్లి వర్షిత్.. మొత్తం 470 మార్కులకుగాను 433 సాధించాడు. ఆయన ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ శుక్రవారం సన్మానించారు. 'వావ్.. వర్షిత్.. శహభాష్..!' అంటూ, భుజం తట్టి అభినందించారు. అధ్యాపకులు సుదర్శన్, శ్రీదేవి, రమేష్‌బాబు, స్వప్న, ప్రణీత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

1922 మంది లబ్ధిదారుల్లో 357 మందికే ఇండ్లు

ఇల్లెందు, మే 2: ఇల్లెందు పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా 1922 మందిని గుర్తించినట్లు, వీరిలో 357 మందిని మొదటి విడతగా ఎంపిక చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత తుది జాబితాను శుక్రవారం మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉన్నట్లయితే లిఖితపూర్వకంగా మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించవచ్చని సూచించారు. మిగిలిన లబ్ధిదారులకు దశలవారీగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

'పాలీసెట్ ప్రవేశ పరీక్ష కోసం శిక్షణ తరగతులు'

కొత్తగూడెం సింగరేణి, మే 2: పాలీసెట్ ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు రుద్రంపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7989103692 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

7 వరకూ సమ్మర్ క్యాంపులు : జేవీవీ

క్యాంపుల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలాజీ

చుంచుపల్లి, మే 2: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) భద్రాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 7 వరకూ కొత్తగూడెం జేబీఎస్ హైస్కూల్లో సమ్మర్ క్యాంపులను నిర్వహించనున్నట్లు జేవీవీ బాధ్యులు శుక్రవారం తెలిపారు. సదరు పాఠశాలలో తొలిరోజు ప్రారంభ కార్యక్రమంలో ఎంఈవో బాలాజీ, హెచ్ఎం నీరజ మాట్లాడారు. ఈ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేవీవీ బాధ్యులు వెంకటేశ్వరరావు, కస్తూరి, వీరభద్రం, కొల్లు నాగేశ్వరరావు, ప్రకాశం, మోహన్‌రావు, సాయిబాబా, తిరుపాలు, మీరా హుస్సేన్ పాల్గొన్నారు.

'ప్రతి పాఠశాలలో ఇంకుడుగుంత ఏర్పాటుచేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రభుదయాళ్

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మే 2 : కొత్తగూడెం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంకుడుగుంతలను కచ్చితంగా ఏర్పాటుచేయాలని ఎంఈవో ప్రభుదయాళ్ సూచించారు. మండలంలోని హెచ్ఎంలతో స్థానిక మండల వనరుల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలి టెన్త్ ఫలితాల్లో మండలం నుంచి 783 మంది విద్యార్థులు హాజరై 693 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఈ నెల 10లోపు ఇంకుడుగుంతలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయలక్ష్మి మృతికి ఎమ్మెల్యే నివాళి

కొత్తగూడెం టౌన్, మే 2: సీపీఐ సుజాతనగర్ మండల నాయకుడు గురుగుల స్వామి సతీమణి విజయలక్ష్మి మృతిచెందారు. విషయం తెలుసుకున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సీపీఐ నాయకులు కొమారి వీరహనుమంతరావు, బొడ్డు కేశవరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'యువ వికాసం' అర్హుల జాబితా

బూర్గంపాడు, మే 2: రాజీవ్ యువ వికాసం పథకం అర్హుల జాబితాను పకడ్బందీగా రూపొందించాలని పంచాయతీ అధికారులను ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశించారు. మండలంలోని వేపలగడ్డ, నకిరిపేట పంచాయతీ కార్యాలయాలను ఆయన శుక్రవారం సందర్శించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనను గమనించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులకు తప్పనిసరిగా రుణాలు అందేలా చూడాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో జమాల్‌రెడ్డి, ఎస్వో భాస్కర్, స్పెషల్ ఆఫీసర్ అశోక్‌కుమార్, ఎంపీవో బాలయ్య పాల్గొన్నారు.

ఈఈ సెల్ ఇన్‌చార్జిగా మురళీధర్‌రావు

కొత్తగూడెం సింగరేణి, మే 2: సింగరేణి ఈఈ సెల్ ఇన్‌చార్జిగా ఏజీఎం మురళీధర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈఎస్ఐసీ సంస్థకు అడిషనల్ కమిషనర్‌గా డిప్యూటేషన్ వెళ్లి ఆయన.. ఇటీవల తిరిగి సింగరేణి సంస్థలోకి వచ్చారు. దీంతో ఆయనకు సంస్థ ఉద్యోగోన్నతి కల్పించి ఈఈ సెల్ ఇన్‌చార్జిగా నియమించింది. ఈ మేరకు సింగరేణి హెడ్డాఫీస్‌లోని ఈఈ సెల్ చాంబర్‌లో శుక్రవారం ఆయన ఈఈ సెల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నేడు 'రాజీవ్ యువ వికాసం' ఇంటర్వ్యూలు

ఇల్లెందు, మే 2: ఇల్లెందు పట్టణానికి చెందిన 'రాజీవ్ యువ వికాసం పథకం' దరఖాస్తుదారులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.00 గంటలకు ఇల్లెందు సీఆర్‌సీ బిల్డింగ్ (మామిడి చెట్ల బడి దగ్గర) ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కేవలం ఎస్సీ కార్పొరేషన్ అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని స్పష్టం చేశారు.

రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం, మే 2: భద్రాచలం సీతారామచంద్ర స్వామిని అర్చకులు శుక్రవారం స్వర్ణభద్ర కవచాలతో అలంకరించారు. బేడా మడపంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

'సీతారామ'ను త్వరగా పూర్తి చేయాలి

చండ్రుగొండ, మే 2: సీతారామ సాగునీటి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తమ పార్టీ స్థానిక కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రైతాంగ సమసమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఎర్రగుంటలో నేటి నంచి వేసవి శిబిరం

అన్నపురెడ్డిపల్లి, మే 2: మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈవో ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరం బ్రోచర్‌ను పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... 6 నుంచి 10 తరగతి (ప్రస్తుతం) విద్యార్థులతా ఉపయోగించుకోవాలని కోరారు. ఉదయం 8.00 నుంచి 11.00 గంటల వరకు ఉంటుందన్నారు.

మలేరియా ప్రాంతాల్లో వైద్యశిబిరాలు

టేకులపల్లి, మే 2: మండలంలోని మలేరియా ప్రభావిత ప్రాంతాలైన మొట్లగూడెం, జంగాలపల్లి గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలను సులానగర్ పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం నిర్వహించారు. నాగుబండి వెంకటేశ్వర్లు (సూపర్‌వైజర్), ధనసరి రాంబాబు, రమేష్‌బాబు, ఇర్సా నాగలక్ష్మి, స్రవంతి, మానస, అరుణాదేవి, కవిత, మంగమ్మ, శిరోమణి, వెంకటరమణ, లక్ష్మీనర్సమ్మ, శారద, కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం పనుల పరిశీలన

దుమ్ముగూడెం, మే 2: మండలంలోని గుర్రాలబైలు, బొజ్జిగుప్పవాగు చెక్‌డ్యాం నిర్మాణ పనులను ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ శుక్రవారం పరిశీలించారు. ఈఈ మధుసూదన్‌రావు, జేఈ రాజ్‌తురాజ్ పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట

చర్ల, మే 2: చర్ల అటవీశాఖ పరిధిలోని శివలింగాపురం, ఆర్ కొత్తగూడెం ఆర్‌వోఎఫ్ఆర్‌లో గ్రావెల్ తవ్వకాలకు అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. మండలానికి ఇటీవల మంజూరైన ఇసుక ర్యాంపులకు రహదారుల నిర్మాణం కోసం అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను చర్ల ఫారెస్ట్ రేంజర్ జి.ద్వాలియా ఆధ్వర్యంలో సిబ్బంది రెండ